క్లుప్తంగా

శాకంబరీదేవిగా యల్లారమ్మ దర్శనం



నగరం: మండలంలోని ధూళిపూడి శివారు లుక్కావారిపాలెం గ్రామ దేవత యల్లారమ్మ అమ్మవారికి ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి పలు రకాల కూరగాయలతో శాకంబరీదేవీ అలంకరణ చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు జరిపారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పంట కాల్వల్లో పూడికతీత



పిట్టలవానిపాలెం: మండల కేంద్రంలోని లాకుల వద్ద నుంచి పంట కాల్వలను బాగు చేసే కార్యక్రమాన్ని కేర్ విద్యా సంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వేగేశన కిశోర్ కుమార్ సోమవారం ప్రారంభించారు. మండలంలోని పంట కాల్వలు అధ్వానంగా ఉండడంతో దిగువ ప్రాంతాల పంట పొలాలకు నీరందడం లేదు. దీంతో కాల్వలను బాగు చేసేందుకు శ్రీకారం చుట్టారు. గత ఆదివారం బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పంట కాల్వలను పరిశీలించి ,వాటిని బాగుచేసేందుకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో కాల్వల్లో పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు పనులను చేపట్టారు. పిట్టలవానిపాలెం లాకుల వద్ద నుంచి ఈస్ట్ సైడ్ చానెల్ పూడికతీత పనులను నిర్వహించారు.

ఎంపీ మోపిదేవి పరామర్శ



రేపల్లె రూరల్: పట్టణంలోని 16వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ చిక్కాల అన్నమ్మ ఇటీవల మృతి చెందారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ఆమె కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. అన్నమ్మ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఆయన వెంట ఉన్నారు.

ఇన్‌చార్జి ఏడీఏగా విజయ్‌బాబు



రేపల్లె రూరల్: రేపల్లె సబ్ డివిజన్ వ్యవసాయశాఖ ఇన్‌చార్జి సహాయ సంచాలకులు (ఏడీఏ)గా ఆర్.విజయ్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఏడీఏగా పనిచేస్తున్న సయ్యద్ అక్తర్ హుస్సేన్ తిరిగి బాపట్ల జిల్లా కార్యాలయానికి వెళ్లారు. ఇప్పటి వరకు ఏవోగా విధులు నిర్వహిస్తున్న విజయ్‌బాబు ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజ్ఞంలో ఎత్తిపోతల పథకం ప్రారంభం



రేపల్లె రూరల్: రేపల్లె నియోజకవర్గం నిజాంపట్నం మండలంలోని ప్రజ్ఞం పంచాయతీ చక్కావారిపాలెం గ్రామంలో పునఃనిర్మాణం చేసిన ఎత్తిపోతల పథకాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు, టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ప్రజ్ఞం గ్రామంలోని పొలాలతో పాటు పరిసర ప్రాంతాల్లోని పొలాలకు కూడా సాగు నీరు అందించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్లు పంపిణీ

ఐలవరం(భట్టిప్రోలు): మండలంలోని ఐలవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్)లో సోమవారం శిక్షా సప్తాహ్‌లో భాగంగా శుభదిన్ భోజన్ కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన జొన్నాదుల వెంకటేశ్వరరావు విద్యార్థులకు పండ్లు అందజేశారు. ఈ పాఠశాలలో గతంలో ఆయన సరస్వతీ దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అలాగే విద్యార్థులకు తోచిన విధంగా వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.వేగేశ్వరరావు, గ్రామస్తులు కూరపాటి రఘురామయ్య, మాచర్ల నాగేశ్వరరావు, డోగుపర్తి శ్రీను, అడిగోపుల శ్రీను, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు

ఆర్డీఓ హెలా షారోన్



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో హెలాషారోన్

రేపల్లె రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రవేశపెట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేసి పరిష్కరించుకోవచ్చని ఆర్డీఓ హెలా షారోన్ అన్నారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పంట కాలువ ఆక్రమణను తొలగించి , పంట పొలాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ నగరం మండలం సజ్జవారిపాలెం గ్రామం నుంచి అర్జీ అందిందన్నారు. సాగు భూమిని సర్వే చేయించి హద్దులు చూపించాలని కోరుతూ అరవపల్లి గ్రామం నుంచి భూపతి బసవరాజు అర్జీ ఇచ్చినట్లు చెప్పారు. నల్లూరు గ్రామం నుంచి మోటూరు రంగనాకమ్మ అనే మహిళ తన మనవళ్ల పొలాన్ని ఆన్‌లైన్ చేయాలని అర్జీ అందించగా, తన ఇంటి స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని కోరుతూ రేపల్లె మున్సిపాలిటీకి చెందిన దామెర్ల శ్రీనివాసరావు అనే వ్యక్తి నుంచి ఒక అర్జీ అందినట్లు తెలిపారు. తన స్థలంలో కొబ్బరి, మామిడి మొక్కలు నాటుకుని సాగు చేసుకునేందుకు ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ అనుమతించిందని, సాగు చేసుకుంటున్న మొక్కలను కొంత మంది రైతులు తొలగించివేశారని సమస్యను పరిష్కరించాలని నిజాంపట్నం మండలం పల్లపట్లకు చెందిన పాముల సతీష్‌కుమార్ దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. సమస్యలను ఆయా శాఖల అధికారుల ద్వారా పరిశీలించి పరిష్కరిస్తామని ఆర్డీవో పేర్కొన్నారు.

పరిష్కార వేదికకు మూడు అర్జీలు

చెరుకుపల్లి: ప్రజా సస్యల పరిష్కార వేదికతో ప్రజల సమస్యలు సంబంధిత అధికారుల ద్వారా సత్వరమే పరిష్కరించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక తహసీల్దారు సీహెచ్ పద్మావతి పేర్కొన్నారు. మండలంలోని తహసీల్దారు కార్యలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మూడు అర్జీలు అందాయని అందులో గుళ్లపల్లి గ్రామానికి చెందిన వంగర కృష్ణమ్మ, రాజవోలు గ్రామానికి చెందిన పి.శివశంకరరావు, చెరుకుపల్లికి చెందిన బి.ఝాన్సీ అనే ముగ్గురు సర్వే సర్టిఫికేట్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దారు తెలిపారు.

రిక్షా కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న రిక్షా కార్మికులు

కొల్లూరు: రిక్షా కార్మికుల జీవనం కష్టతరమైన తరుణంలో ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ నేతృత్వంలో రిక్షా కార్మికులు తహసీల్దార్ పుల్లారావుకు వినతి పత్రం అందజేశారు. సోమవారం రెవెన్యు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రెండు అర్జీలు అందినట్లు తహసీల్దారు ఈ సందర్భంగా తెలిపారు. తహసీల్దారును కలసిన రిక్షా కార్మికులు తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కొత్త రిక్షాలు పంపిణీ చేయాలని కోరారు. మరమ్మత్తులకు గురైన రిక్షాలకు నగదు సాయం చేయడంతోపాటు, తమ రిక్షా స్టాండ్‌ను మెరుగు పరచాలని కోరారు. మండలంలోని పెసర్లంక అరవింద వారధి సమీపంలో కృష్ణా నదికి ఏర్పడిన గండిని యుద్ధప్రాతిపదికన పూడ్చాలని లంక గ్రామాల ప్రజా ప్రతినిధులు పలువురు తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. కృష్ణా నదికి వరదలు సంభవించే సూచనలుండటంతో తక్షణం పనులు చేపట్టించాలని కోరారు. సమస్యలపై తమకు అందిన అర్జీలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దారు అర్జీదారులకు సమాధానం ఇచ్చారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన తప్పనిసరి



కుష్ఠు వ్యాధిపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

నిజాంపట్నం (రేపల్లె రూరల్): కుష్ఠు వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కూచినపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నాగార్జున అన్నారు. కుష్ఠు వ్యాధిపై మండలంలోని బొర్రావారిపాలెం గ్రామంలో సోమవారం గ్రామస్తులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కుష్ఠు వ్యాధి లక్షణాలను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, చెవులు, వీపు, ఎదపై నొప్పిలేని బొడిపెలు, కనుబొమ్మలు, కను రెప్పల వెంట్రుకలు రాలిపోవటం, ముక్కు దిబ్బడ, ముక్కు నుంచి రక్తం రావటం, కాళ్లు చేతులు తిమ్మిర్లు రావటం, అరిచేతులు, అరికాళ్లు స్పర్శ కోల్పోవటం, చల్లని, వేడి వస్తువులను గుర్తించలేకపోవటం, తెలియకుండా చేతులు, కాళ వేళ్లలో బొబ్బలు రావటం, చేతి వేళ్లు, కాలివేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావటం వంటివి కుష్ఠు వ్యాధి లక్షణాలన్నారు. ఇటువంటి లక్షణాలు శరీరంలో గమనిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స పొందలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మురళీ, ఏఎన్ఎం రేష్మ, ఆశ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలి



ఎన్జీవో సంఘం నాయకులకు వినతి పత్రం ఇస్తున్న ఏఎన్ఎంలు

బాపట్ల: చాట్ గ్రూపుల్లో ఏఎన్ఎంలను కించపరిచినట్లు మాట్లాడిన మండల అధికారిపై చర్యలు తీసుకునేందుకు ఎన్జీవో అసోసియేషన్ కృషి చేయాలని ఏఎన్ఎంలు డిమాండ్ చేశారు. స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో ఏఎన్ఎంలు మాట్లాడుతూ వృద్ధాప్య పెన్షన్లు పంపిణీ విధానంలో.. ఏఎన్ఎంల జాబ్ చాట్‌ను కించపరిచే విధంగా మాట్లాడటం సరికాదని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఏఎన్ఎంలపై అనుచిత వ్యాఖ్యలు మళ్లీ పునరావృతం కాకుండా అసోసియేషన్ కృషి చేయాలని సూచించారు. నాయకులు పి.నాగేశ్వరరావు, ఇస్సాకు, సుబ్బారాయుడు, బి.ప్రసాద్‌లకు ఏఎన్ఎంలు పి.సంధ్యారాణి, సునీత, విజయలక్ష్మి ఉన్నారు.

ప్రపంచ వారసత్వ కమిటీ సమావేశాలకు డాక్టర్ ఈమని



డాక్టర్ ఈమని శివ నాగిరెడ్డి

తెనాలి: భారత ప్రభుత్వ ఆతిథ్యంలో దేశరాజధాని ఢిల్లీలో 195 దేశాలు పాల్గొంటున్న 46వ ప్రపంచ వారసత్వ కమిటీ సమావేశాలకు తెనాలికి చెందిన పురావస్తు పరిశోధకుడు, వారసత్వ పరిరక్షణ నిపుణుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి హాజరయ్యారు. ప్రస్తుతం తెలంగాణాలోని ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ బాధ్యతల్లో ఉన్న ఆయన్ను ఆ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అతిథిగా ఈ సమావేశాలకు నామినేట్ చేసింది. ఢిల్లీలోని భారత మండపంలో రెండురోజులపాటు నిర్వహించనున్న అంతర్జాతీయ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. యునెస్కో సభ్యదేశాలు, తమ దేశాలకు చెందిన పురాతన స్థలాలు, కట్టడాలు, సుందర ప్రకృతి ప్రదేశాలకు ప్రపంచ వారసత్వ జాబితాలో చోటు కోసం పంపే ప్రతిపాదనలను ఈ సమావేశాల్లో చర్చిస్తారని డాక్టర్ శివనాగిరెడ్డి తెలిపారు. అప్పటికే తాత్కాలిక జాబితాలో చోటు దక్కించుకొన్న వాటిపై ఎన్నిక ప్రక్రియ జరుగుతుందని, ఆసక్తికరంగా సాగే చర్చల ద్వారా, కొత్త ప్రతిపాదనల నివేదికల తయారీకి అవసరమైన నైపుణ్యాన్ని సంతరించుకొనే వీలు చిక్కిందని వివరించారు. తనతో పాటు వారసత్వ నిపుణులు, వాస్తు శిల్పులు(ఆర్కిటెక్టులు) మణికొండ వేదకుమార్, ఎం.పాండురంగరావు, డాక్టర్ శోభా, ప్రొఫెసర్ కేపీ రావు, డాక్టర్ పద్మనాభలను తెలంగాణ ప్రభుత్వం నామినేట్ చేసిందని, అవకాశమిచ్చిన తెలంగాణ ప్రభుత్వ పర్యాటకశాఖ ముఖ్య కార్యదర్శికి, ప్రభుత్వానికి శివనాగిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

చిన్న సినిమాల విడుదలకు సదావకాశం

- తెలంగాణలో పర్సంటేజ్ విధానం
- ఆంధ్రలోనూ అమలు చేయాలి
- 'మా-ఏపీ' వ్యవస్థాపకుడు దిలీప్ రాజా



మాట్లాడుతున్న దిలీప్‌రాజా

తెనాలి: తెలంగాణలో ఆగస్టు 2వ తేదీ నుంచి థియేటర్లలో సినిమాల ప్రదర్శనకు పర్సంటేజీ విధానం ఆచరణలోకి వస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ లోనూ ఇదే పద్ధతిని అమలు చేయాలని 'మా-ఏపీ' వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మరో సినీదర్శకుడు అచ్చన శ్రీనివాసయాదవ్‌తో కలసి సోమవారం స్థానిక 'మా-ఏపీ' 24 విభాగాల యూనియన్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో మాదిరిగా థియేటర్లకు అద్దె చెల్లించకుండా పర్సంటేజీ పద్ధతి అమల్లోకి వస్తే, చిన్న సినిమా నిర్మాతలకు ఎంతో ఉపయోగమన్నారు. వెంటిలేటర్ పై ఉన్న థియేటర్లు బతుకుతాయని అన్నారు. గ్లోబల్ ఫిలింస్ సునీల్ నారంగ్, ఎస్వీ క్రియేషన్స్ శిరీష్‌రెడ్డి దగ్గర హైదరాబాద్‌లో ఏవిధంగా అగ్రిమెంట్లు జరుగుతున్నాయో అలాగే, అగ్రిమెంట్లను రూపొందించుకోవాల్సిందిగా ఆంధ్రకు చెందిన చిన్న నిర్మాతలకు ఆయన సూచించారు. దయచేసి ఖాళీ అగ్రిమెంట్లను ఎవరూ ఇచ్చి రావద్దని చెప్పారు. సినీదర్శకుడు అచ్చన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ భారత దేశంలోని అన్ని సింగిల్ స్క్రీన్ థియేటర్లకు పర్సంటేజీ విధానంలో షేర్ వస్తుందని, ఏపీలో థియేటర్ల యాజమాన్యం, కంట్రోలర్ అసోసియేషన్ సహకరించాలని కోరారు. వీరితో కో-డైరెక్టర్ ఇంటూరి విజయభాస్కర్, సిద్దెల మనోహర్ ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

తెనాలిరూరల్: గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమందించారు. పట్టణ బాలాజీరావుపేటలో ఆలపాటి వారధి నుంచి రైల్వేస్టేషన్ రోడ్డులోకి వెళ్లే వీధిలో పాడు బడిన దాల్ మిల్లు మెట్ల వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉండడాన్ని స్థానికులు సోమవారం సాయంత్రం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతుడి వయసు సుమారు 30 నుంచి 35 ఉంటుంది. నీలం రంగు జీన్సు ప్యాంటు, నలుపు, కాఫీ కలర్ నిండు చేతుల షర్టు ధరించి ఉన్నాడు. ఎడమ చేయి చిటికెన వేలుకు సాయిబాబు ఉంగరం ఉంది. మృతి చెంది నాలుగు రోజులు అయి ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

రేపల్లె రూరల్: ప్రభుత్వ పాలిటెక్నిక్ రేపల్లె కళాశాలలో ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్‌ల ప్రక్రియ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక కళాశాలలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మెకానికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్స్ బ్రాంచ్‌లలో సీట్లు పొందేందుకు 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అడ్మిషన్ పొందేందుకు 10వ తరగతి షార్ట్ మెమో, టీసీ, స్టడీ సర్టిఫికెట్‌లతో హాజరుకావాలన్నారు. కళాశాలలో దూర ప్రాంతాల నుంచి వచ్చే చేరే విద్యార్థులకు హాస్టలు సౌకర్యం ఉందన్నారు. పూర్తి వివరాలకు 80965 55306 నంబరును సంప్రదించ వచ్చన్నారు. కళాశాలలో చదివే ఫైనల్ ఇయర్ విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్ మెంట్‌ను ఏర్పాటు చేస్తున్నారన్నారు.

విద్యార్థులకు భోజనం



అమర్తలూరు(వేమూరు): శిక్షా సప్తాహ్ ద్వారా పాఠశాల విద్యార్థులకు భోజనం అందించడం జరిగిందని ప్రధానోపాధ్యాయుడు నిరీక్షణ రావు తెలిపారు. అమర్తలూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గ్రామస్తులు లేదా ఉపాధ్యాయులు సహకారంతో భోజన వసతి కల్పించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రధానోపాధ్యాయుల సహకారంతో సోమవారం రూ.25 వేల ఖర్చుతో 400 మంది విద్యార్థులకు తిథి భోజనం ఏర్పాటు చేశారు.

శుభ్రమైన నీటినే తాగాలి



తెనాలిరూరల్: ప్రజలు శుద్ధి చేసిన నీటినే తాగాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణ 30వ వార్డులోని అమరావతి ప్లాట్స్‌లో పురపాలక సిబ్బంది నీటి నమూనాలను సోమవారం సేకరించారు. కమిషనర్ నీటిని నమూనాలను పరిశీలించడంతో పాటు నీటిని తాగి నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘం ఆధ్వర్యంలో రక్షిత తాగునీటిని అందిస్తున్నామని చెప్పారు. బోర్ల నీరు వినియోగించే వారు నీటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. అలానే 29వ వార్డులో మార్కెట్ యార్డు, జిల్లా ప్రభుత్వ వైద్యశాల, అన్న క్యాంటీన్‌ల వద్ద పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు.

వృద్ధులకు అన్నదానం

తెనాలిరూరల్: స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా శాంతి ఆశ్రమం, నాజరుపేటలోని మన ఇల్లు వృద్ధాలయాల్లో వృద్ధులకు సోమవారం ఆహారం, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. తాడికొండ మండలం మోతడకలోని చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థులు సేవ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగశ్రీనివాసరావు, డీన్ పి.ఫణికుమార్, సీఎస్ఈ విభాగాధిపతి జి. రామచంద్రరావు పాల్గొన్నారు.

యువకుల ఆత్మహత్యాయత్నం

పొన్నూరు: మండల పరిధిలోని నండూరు గ్రామంలో కుటుంబ కలహాల నేపథ్యంలో ఇరువురు యువకులు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం గ్రామంలోని వేర్వేరు కుటుంబాలకు చెందిన అభిరామ్, మహేష్ తల్లిదండ్రులు మందలించడంతో పురుగు మందు తాగినట్లు తెలిసింది. కుటుంబ సభ్యులు వెంటనే పొన్నూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించడంతో చికిత్స పొందుతున్నారు.

అధైర్యపడొద్దు.. అన్ని విధాలా ఆదుకుంటాం

డాక్టర్ ఈవూరి గణేష్



ఆర్థిక సాయం అందిస్తున్న డాక్టర్ ఈవూరి గణేష్

చెరుకుపల్లి: ఆపదలో ఉన్న ప్రతి వైఎస్సార్ సీపీ కుటుంబాన్ని పార్టీ పరంగా అన్ని విధాలా ఆదుకుంటామని రేపల్లె నియోజకవర్గ ఆ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ ఈవూరి గణేష్ కార్యకర్తలకు భరోసానిచ్చారు. ఇటీవల మండలంలోని రాంబొట్లవారిపాలెం గ్రామంలోని దళిత కుటుంబానికి చెందిన బేతబ్రోలు రాజ్‌కుమార్ కుటుంబాన్ని కూటమి రౌడీ మూకలు విచక్షణ రహితంగా కొట్టారు. బాధిత కుటుంబాన్ని డాక్టర్ ఈవూరి గణేష్ సోమవారం సాయింత్రం పరామర్శించి, కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని అధర్య పడొద్దని భరోసానిచ్చారు. అనంతరం ఆ కుటుంబానికి మండల నాయకులతో కలసి వారికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షా సప్తాహ్ వారోత్సవాలు



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు నీలి బంగారయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పిట్టువారిపాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ వారోత్సవాలు కార్యక్రమం ముగింపు సందర్భంగా తిథి భోజనాలను విద్యార్థులకు ఏర్పాటు చేశారు. పిట్టువారిపాలెంలో పిట్టు సాయిబాబారెడ్డి, చందోలులో ఎండీ అఫ్జల్ తన స్నేహితులతో కలిసి విద్యార్థులకు తిథి భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి, బుల్లెమ్మ మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి 29 వ తేదీ వరకు శిక్షా సప్తాహ్ వారోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. చివరి రోజున తిథి భోజనాలను విద్యార్థులకు అందించినట్లు తెలిపారు. దాతల సహకారంతో చందోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చికెన్ బిర్యాని అందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బుల్లెమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత బాపట్ల



విజేత జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు

కర్లపాలెం: క్రీడాకారులు శారీరక ధృడత్వం కలిగి ఉండటంతో పాటు సమాజంలో మంచి గుర్తింపు కలిగి ఉంటారని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మరాజు తెలిపారు. కర్లపాలెంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం సాయంత్రం ముగిసింది. ఈ టోర్నమెంటులో బాపట్ల జట్టు విజయం సాధించింది. విజేతకు కంకిపాటి బోజరాజు అందించిన రూ.20వేల నగదును ఎమ్మెల్యే నరేంద్ర వర్మ క్రీడాకారులకు అందజేశారు. అలాగే ద్వితీయ స్థానంలో నిలిచిన ఎంవీ రాజుపాలెం టీమ్‌కు పిట్టు తిరుమలరెడ్డి రూ.15వేలు, తృతీయ స్థానంలో నిలిచిన లెవన్ ఎంగ్ టైగర్స్ టీమ్‌కు పిట్టు చంద్రశేఖర్ రెడ్డి రూ.10వేలు, నాల్గవ స్థానంలో నిలిచిన పిట్టువారిపాలెం టీమ్‌కు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి రూ.7వేలు, ఐదవ స్థానంలో నిలిచిన శీలంవారిపాలెం టీమ్‌కు పిట్ల వసంతరెడ్డి ఇచ్చిన రూ.5వేలు నగదును ఎమ్మెల్యే అందజేశారు. ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతి ఆట్ల బాల శంకర రెడ్డి అందజేయగా.. టోర్నమెంటు మెయింటినెన్స్ ఖర్చులు పులుగు రాంబాబురెడ్డి అందజేశారని క్రికెట్ టీమ్ నిర్వాహకులు తెలిపారు. క్రికెట్ నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులు

ఆగ్రహం వ్యక్తం చేసిన ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీకృష్ణయ్య

నగరం: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య కోరారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ పాల్గొని, మాట్లాడారు. అధికారులు ప్రోటోకాల్ పాటించకుండా..నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. మండల సర్వసభ్య సమావేశానికి కూడా అధికారులు హాజరుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరస్పర ఫిర్యాదులపై కేసు నమోదు

కొల్లూరు : ఒకరిపై ఒకరు పరస్పరం ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు కేసులలు నమోదు చేసిన ఘటన సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని జువ్వలపాలేనికి చెందిన దోవ సుబ్బారావును అతని భార్య ఐదేళ్ల క్రితం ఒదిలేసి వెళ్లిపోయింది. ఆదివారం రాత్రి అతను ఇంటి వద్ద అతని భార్యను తిట్టుకుంటూ.. ఉన్న సమయంలో తమనే దూషిస్తున్నాడని భావించిన భూపతి దయామణి ఆమె భర్త మణిశంకర్ సుబ్బారావుపై కర్రలతో దాడి చేశారు. దీంతో అతనికి గాయాలయ్యాయి. తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితుడు వైద్యశాలలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు దయామణి, మణిశంకర్‌పై కేసు నమోదు చేశారు. దోవ సుబ్బారావు పొలం నుంచి వస్తున్న సమయంలో.. తన చీర పట్టుకొని లాగి కౌగిలించుకునేందుకు ప్రయత్నం చేశాడని, తాను ప్రతిఘటించడంతో తనపై కర్రతో దాడి చేసి తలపై కొట్టి గాయపర్చాడని దయామణి తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సుబ్బారావుపైన కూడా కేసు నమోదు చేశారు. పరస్పర కేసులపై దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యావనరుల కార్యాలయంలో చోరీ



కార్యాలయంలో దొంగతనం జరిగిన తీరును పరిశీలిస్తున్న పోలీసులు

ప్రత్తిపాడు: మండల విద్యావనరుల కార్యాలయంలో చోరీ జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని మండల విద్యావనరుల కార్యాలయానికి శనివారం సాయంత్రం కార్యాలయ సిబ్బంది ఎప్పటిలానే తాళాలు వేసి వెళ్లిపోయారు. ఆదివారం సెలవు కావడంతో సోమవారం ఉదయం కార్యాలయ అటెండర్ రేణుక ఆఫీసుకు వచ్చారు. అప్పటికే కార్యాలయ ప్రధాన ద్వారంతో పాటు ఎంఈవో-1 గదికి ఉన్న తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. వెంటనే విషయాన్ని ఎంఈవో సీహెచ్ రమాదేవికి ఫోన్ ద్వారా తెలియజేశారు. వారు వచ్చి పరిశీలించగా హాల్‌లో ఉండాల్సిన 43 ఇంచెస్ ఎల్ఈడీ స్మార్ట్ టీవీని ఆగంతకులు అపహరించుకుపోయినట్లుగా గుర్తించారు. దీంతో ఎంఈవో రమాదేవి ప్రత్తిపాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. కాగా ఇదే కార్యాలయంలో గతంలోనూ గుర్తు తెలియని వ్యక్తులు బ్యాటరీలు, ఇన్వర్టర్లను దొంగిలించారు.

ఎట్టకేలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

ప్రత్తిపాడు: ప్లస్ టూ విద్యార్థులకు ఎట్టకేలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రత్తిపాడు భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని జూనియర్ కళాశాల (ప్లస్ టూ) విద్యార్థులకు క్లాసులు ప్రారంభమై దాదాపు 40 రోజులు గడుస్తున్నా నేటి వరకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చెయ్యలేదంటూ ఈ నెల 29న 'సాక్షి'లో 'పుస్తకం లేని పాఠం' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం ప్రభుత్వ పాఠ్యపుస్తకాల డైరెక్టర్ కె.రవీంద్రరెడ్డి పుస్తకాలు పంపిణీ చెయ్యకపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. ప్రత్తిపాడు మండల విద్యాశాఖ అధికారులకు ఫోన్ చేసి సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఈవో శైలజ వెంటనే విచారించి తనకు విషయాన్ని తెలియజేయాలని ఎంఈవోలను ఆదేశించారు. అనంతరం హెచ్ఎం హెచ్.శ్రీనివాసరావు, ఎంఈవోలు సీహెచ్ రమాదేవి, లీలారాణిలు స్థానిక టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించారు.

